నవతెలంగాణ
ఆదిలాబాద్
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

గాయపడిన గీత కార్మికుడు మృతి

నవతెలంగాణ-జైపూర్



తాటి చెట్టు పైనుండి పడి గాయపడిన బొంగుని రమేష్‌గౌడ్ శనివారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..కిష్టాపూర్ గ్రామపంచాయతీ రుమ్మిపూర్‌కు చెందిన రమేష్‌గౌడ్ ఈ నెల 9న ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుండి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాల పట్టణంలోని మెడిలైఫ్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-నేరడిగొండ



మండలంలోని లఖంపూర్ గ్రామం వద్ద కారు బోల్తా పడి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నాగ్‌పూర్ నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో లఖంపూర్ వద్ద కారు టైర్ పేలడంతో డివైడర్‌కు ఢీకొంది. పల్టీలు కొట్టి బోర్ల పడింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన వారిని స్థానికులు బయటకు తీశారు.

ఘాట్ రోడ్డులో కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



కెరమెరి : కెరమెరి ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పలువురు తృటిలో ప్రాణాలతో బయట పడ్డారు. ఎస్సై గుంపుల విజయ్ కుమార్ తెలిపిన ప్రకారం..కాగజ్‌నగర్‌కు చెందిన షేక్ సమీర్ గోలేటి నుండి ఆదిలాబాద్ షిఫ్ట్ డిజైర్ కారులో వస్తున్నాడు. మార్గమధ్యలో కెరమెరి ఘాట్ రోడ్ వద్ద ఉట్నూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆసిఫాబాద్‌కు వస్తుండగా డ్రైవర్ కేంద్రే రాహుల్ బస్సును అతివేగంగా, జాగ్రత్తగా నడపడం వల్ల ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ సమీర్, సొల్లు లక్ష్మికి గాయాలయ్యాయి. కారు డ్రైవర్ సమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లైన్‌మెన్ సస్పెన్షన్

ముధోల్ : ముధోల్ లైన్‌మెన్ హల్దార్‌ను సస్పెన్షన్ చేసినట్లు డివిజన్ ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..లైన్‌మెన్ ముధోల్‌లో ఓ రైతుకు మూడు బోర్లు ఉంటే 12 బోర్లు ఉన్నాయని సృష్టించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కొరకు సంబంధిత అధికారులకు తప్పుడు నివేదిక పంపారు. దీంతో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరయ్యాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించగా సంబంధిత లైన్‌మెన్ సర్వే తప్పు చేసి డిపార్ట్మెంట్‌కు సుమారు రూ.6లక్షల30వేల నష్టానికి కారకుడయ్యాడు. అధికారులను తప్పుదోవ పట్టించాడు. ఈ విషయంలో ఏడీఏ లక్ష్మణ్ విచారణ జరిపారు. దీంతో లైన్‌మెన్ తప్పిదాలు బయటపడడంతో సస్పెన్స్ చేసినట్లు డీఈఈ పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



మంచిర్యాల : ఎటువంటి పండుగలైనా కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ ఆర్.ప్రకాష్ అన్నారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం కమిటీ పెద్దలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ముస్లిములు బక్రీద్ పండుగను జరుపుకోవాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు ఇవ్వొద్దని తెలిపారు. మంచికి మారుపేరుగా నిలిచిన మంచిర్యాల జిల్లాకు చెడ్డ పేరు తీసుకురావద్దన్నారు. హిందూ ముస్లింలు సోదరభావంతో పండగలు జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్ : విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.20లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యేను విశ్రాంత ఉద్యోగులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కిష్టన్న సభ్యులు, బిజెపి జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, పట్టణ అధ్యక్షుడు లాలా మున్నా, విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం కోసం స్థలాల పరిశీలన

ఖానాపూర్ : మున్సిపాలిటీకి తాగునీటి కోసం నూతనంగా రెండు వాటర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ నిర్మాణం కోసం స్థలాన్ని శనివారం అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి అమృత్-2 స్కీం కింద మంజూరైన రెండు నూతన వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణం కోసం పట్టణంలో స్థలాలను పరిశీలించామన్నారు. త్వరలోనే రెండు వాటర్ ట్యాంకులు, వార్డులలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు తాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అబ్దుల్ ఖలీల్, నాయకులు పరిమి సురేష్, షబ్బీర్ పాషా, సలీంఖాన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, డీఈ సంతోష్ జాదవ్, ఏఈ తిరుపతి పాల్గొన్నారు.

లంబాడీలపై ఘోరాలు అరికట్టాలి

నేరడిగొండ : ఇటీవల కాలంలో లంబాడాలపై దారుణాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాలని లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మహేందర్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నార్నూర్ మండలానికి చెందిన ఉపాధ్యాయుడు హత్యకు గురయ్యాడన్నారు. హైదారాబాద్ మియాపూర్‌లోనూ దాడి జరిగిందన్నారు. ఇలా రోజురోజుకూ గిరిజన లంబాడీలపై హత్యలు, లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జిల్లా నాయకులు



ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో శనివారం డిప్యూటీ సీఎంను జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బీఆర్ఎస్ నాయకునిపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

జైపూర్ : ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను కించపర్చే విధంగా వాట్సాప్ గ్రూప్, ఫ్లాష్ న్యూస్‌లో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ నాయకుడు కలెగూర రాజకుమార్‌పై కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భీమారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నాయకులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడైన కలెగూర రాజకుమార్ కాంగ్రెస్ శ్రేణులను, ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడితే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రాములు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

జైపూర్ : ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వ్యక్తికి సబంధించి వారు 8712656551, 8712656549 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అంతా ఇష్టారాజ్యం..!

- నిబంధనలు విస్మరిస్తున్న ప్రయివేటు విద్యా సంస్థలు
- అరకొర వేతనాలతో ఉపాధ్యాయుల నియామకం
- కొన్ని పాఠశాలల్లో అర్హత లేనివారితోనూ బోధన
- పర్యవేక్షణ మరిచిన విద్యాశాఖ అధికారులు

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. అంతా తమ ఇష్టారాజ్యమే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం, విద్యాశాఖ రూపొందించిన నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనాలు కూడా అమలు చేయకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారు. మరోపక్క కొన్ని ప్రయివేటు పాఠశాలలు అర్హతలేని వారిని నియమించి తక్కువ వేతనాలతో బోధన కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విద్యాశాఖ పర్యవేక్షణలో జరగాల్సిన ఉపాధ్యాయుల నియామకాన్ని ఆయా పాఠశాలల యాజమాన్యాలే చేపడుతున్నాయి. ఇలా నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ అధికారులు మామూలుగా తీసుకుంటూ వదిలేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా అందులో పనిచేసే ఉపాధ్యాయులతో పాటు చదువుకొనే విద్యార్థులు సైతం నష్టపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటూ విద్యార్థులకు విద్యనందిస్తుండగా..మరికొన్ని పాఠశాలలు మాత్రం విద్యను కూడా వ్యాపారపరంగానూ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని..నాణ్యమైన విద్యనందిస్తున్నామని చెబుతున్నా విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. విద్య, సౌకర్యాలు ఎంత అధునాతంగా ఉన్నా.. ఫీజులు సైతం అంతకంటే భారీగానే ఉంటున్నాయనేది బహిరంగ సత్యమే. మరోపక్క ప్రభుత్వ ప్రమాణాలు పాటించకుండా..ఫీజు నియంత్రణ కమిటీలు లేకుండా ఇష్టారీతిన పెంచుతూ అందినకాడికి దండుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని పాఠశాలలైతే ఏకంగా స్కూళ్లలోనే పుస్తకాలు, బట్టలు విక్రయిస్తూ నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. ఇలాంటి వాటిపై దృష్టిసారించాల్సిన విద్యాశాఖ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. బదుల పర్యవేక్షణ మరిచిపోవడం.. అటు వైపు కనీసం కన్నెత్తి చూడకపోవడం మూలంగా కొన్ని ప్రయివేటు విద్యా సంస్థల ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోందనే ఆరోపణలున్నాయి.

అరకొర వేతనాలతో సరి..!

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు విద్యాశాఖ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం దృష్టిసారించడం లేదు. నిబంధనల ప్రకారం అందులో ఉపాధ్యాయులను నియమించాలంటే కచ్చితంగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. తదనంతరం విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలోనే అర్హత కలిగిన వారిని నియమించాల్సి ఉంటుంది. ప్రాథమిక పాఠశాలలో బోధించేందుకు డీఎడ్ పూర్తిచేసి ఉండటం.. ఉన్నత పాఠశాలల్లో బీఈడీ పూర్తిచేసిన వారిని నియమించాల్సి ఉంటుంది. మరోపక్క ఇలా నియమితులైన ఉపాధ్యాయులకు వేతనాలు సైతం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. పే స్లిప్‌లను పాఠశాలలో అందుబాటులో ఉంచాలి. కానీ అనేక పాఠశాలల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు. కేవలం అరకొర వేతనాలు అందించి బోధన చేయిస్తున్నారు. మరోపక్క కొన్ని పాఠశాలల్లో అర్హత లేని వారిని కూడా నియమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పాఠశాల రికార్డుల్లో మాత్రం అర్హత కలిగిన ఇతరుల పేర్లు రాసి..అర్హత లేని వారితో బోధన చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి వ్యవహారాలు జరుగుతున్నా..విద్యాశాఖ అధికారులు కనీసం వాటిని పరిశీలించి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. గతంలో నిబంధనలు విస్మరించిన ప్రయివేటు పాఠశాలలపై చర్యలు చేపట్టిన విద్యాశాఖ కొన్నేండ్ల నుంచి పర్యవేక్షణను పూర్తిగా విస్మరించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామూలుగా తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే అపవాదు వస్తోంది.





నడిపించే 'నాన్న'

- మారుతున్న కాలానికి మార్గదర్శి
- నేడు ఫాదర్స్ డే

నవతెలంగాణ-మంచిర్యాల

నవ మాసాలు మోసి పెంచేది తల్లి అయితే..పుట్టిన పిల్లలను తన గుండెలపై మోసేవాడే నాన్న. సహనానికి మారు పేరు నాన్న. మారుతున్న కాలానికి మార్గదర్శి నాన్న. ఏది కోరినా చిటికెలో తెచ్చిస్తాడు..పిల్లల కోసం నిత్యం ఆరాట పడతాడు. తన కోరికలను త్యాగం చేసి పిల్లల శ్రేయస్సు కోసం పరితపిస్తాడు. పిల్లల చేయి పట్టుకొని బడికి పంపించడం మొదలు ఉన్నత స్థాయికి చేరే వరకు నాన్న పడే శ్రమ అంతాఇంత కాదు. పిల్లలపై నాన్న చూపించే కోపం వెనుక అమితమైన ప్రేమ ఉంటుంది. నాన్న ఉంటే కుటుంబానికి ధైర్యం, భరోసా. పిల్లల కోరికలు తీర్చడమే తప్ప ఎటువంటి స్వార్థం లేని వాడు. పిల్లలకు మంచి మిత్రుడిగా, మార్గదర్శిగా ఉంటాడు. మరి కొందరికి తల్లి పాత్ర కూడా తానే అయి నడిపించే దైవమే నాన్న. పెళ్లయి అత్తగారింటికి వెళ్లిన ఆడ పిల్లలకైనా, ఉద్యోగాలు చేస్తూ ఎక్కడో స్థిరపడి పోయిన మగ పిల్లలకైన నాన్న పంచిన అనురాగం, ఆప్యాయతలు, నాన్నతో గడిపిన మధుర క్షణాలు ప్రతి వ్యక్తి జీవితంలో మరిచిపోలేని అనుభూతులు. నేడు ఫాదర్స్ డే సందర్భంగా నవతెలంగాణ కథనం..



మై డాడీ ఈజ్ మై హీరో : కస్తూరి ప్రవళిక, స్టాఫ్ నర్స్



మాది బెల్లంపల్లి. నాన్న పేరు కస్తూరి సత్యనారాయణ. మా నాన్న చిన్న వ్యాపారం చేస్తూ మమ్ముల్ని పెంచాడు. ఉన్నత చదువులు చదివించేందుకు నాన్న పడ్డ కష్టం అంతాఇంత కాదు. అమ్మ గృహిణిగా మా ఆలన పాలన అంత ఆమె చూసుకునేది. ఉద్యోగాల కొరకు ప్రిపేర్ అయ్యే సమయంలో మా నాన్న నన్ను చాలా ప్రోత్సహించాడు. ఉద్యోగం కోసం చేసే ప్రయత్నంలో ఎటువంటి ఒడిదొడుకులు వచ్చినా మా నాన్నే అన్ని చూసుకున్నాడు. నాన్న ఇచ్చిన ప్రోత్సహంతో స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాను. అన్నీ తానై నన్ను నడిపించిన మా నాన్నకు జీవితాంతం రుణపడి ఉంటా. అందుకే మై డాడీ ఈజ్ మై హీరో.

ఎక్కడా రాజీ పడే వారు కాదు : జయశ్రీ, ఆర్థోపెడిక్ డాక్టర్



నా పేరు జయశ్రీ. మాది ఏలూరు. నాన్న పేరు శ్రీనివాస్ మూర్తి. ఒక తమ్ముడు ఉన్నాడు. నాన్న వైజాగ్‌లోని రెడ్డీస్ ల్యాబరేటరీలో ఉద్యోగం చేసే వాడు. మమ్మల్ని చదివించేందుకు నాన్న చేసిన కష్టం ఇప్పటికీ మా కళ్లలో మెదులుతూనే ఉంది. మా చదువుల విషయంలో ఆయన ఎక్కడా రాజీ పడలేదు. నాన్న పడ్డ కష్టమే మమ్మల్ని ఉన్నత స్థానంలో నిలిపింది. నన్ను డాక్టర్‌గా, తమ్ముడిని అగ్రికల్చర్ శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగిగా చేసిన మా నాన్న మాకెప్పుడు హీరోనే. ప్రస్తుతానికి నేను మంచిర్యాలలో ఆర్థోపెడిక్ డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను.

నాన్న ఎన్నో బాధలు అనుభవించాడు : లత, గృహిణి, మంచిర్యాల



మాది శ్రీరాంపూర్. నాన్న పేరు కుదిరే రాజయ్య. సింగరేణి ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం, ఒక తమ్ముడు, మొత్తం నలుగురం. చాలీచాలని జీతంతో నాన్న మమ్ముల్ని పెంచి పోషించిన తీరు గుర్తుకు వస్తే బాధనిపిస్తది. ఆయన నేర్పిన సంస్కారం, ఎవరి పట్ల ఎలా వ్యవహరించాలి చెప్పిన తీరు మాలో బలంగా నిలిచింది. అందుకే మాకు పెళ్లి అయి అత్త వారింటికి వెళ్లినప్పటికీ మా నాన్న చూపిన మార్గంలోనే నడిచి అత్తగారింట్లోనూ మంచి కోడళ్లుగా పేరు తెచ్చుకున్నాం. ముగ్గురం ఆడ పిల్లలం అయినప్పటికీ మా నాన్న మా విషయంలో ఎప్పుడూ బాధ పడలేదు. భారం అనుకోలేదు. ముగ్గురిని చదివించి పెళ్లిళ్ల చేశాడు. ఇప్పుడు మా భర్త, పిల్లలతో సంతోషంగా ఉన్నాం. మేం ఇంత సంతోషంగా ఉండడానికి కారణం మా నాన్నే. ఇప్పటికీ నాన్న వాళ్లింటికి వెళ్లడం అంటే సంతోషమే.

పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- సీపీ(ఐ)ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారులో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య తెలిపారు. చెన్నూర్ మండలం రాజన్న కాలనీలో శనివారం నాగజ్యోతి అధ్యక్షతన గుడిసెవాసుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని 14 నెలలుగా పోరాటం చేస్తూ పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

గత ప్రభుత్వ పాలనలో పేదలకు అన్యాయం జరిగిందని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తామని చెబుతున్న ప్రకారం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తూ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని ఎండకు ఎండుతూ, వానలకు తడుస్తూ అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, గుడిసెల పోరాట కమిటి సభ్యులు ఉమారాణి, సమ్మక్క, సరిత, చంద్రన్న, కుమార్, రాజేశ్వరి, రేణుక, సహనా బేగం, భూదక్క, రమాదేవి, జమున, శ్రావణ్, యామిని, లక్ష్మి పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీలో రాష్ట్ర స్థాయిలో 2వ స్థానంలో మంచిర్యాల

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్

నవతెలంగాణ-నస్పూర్

బ్యాంక్ లింకేజీలో 3సంవత్సరాలుగా మంచిర్యాల జిల్లా రాష్ట్ర స్థాయిలో అవార్డు తీసుకోవడం జరుగుతోందని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 2వ స్థానంలో నిలిచిందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలలో జిల్లాకు అవార్డు వచ్చిందన్నారు. 2023-24 సంవత్సరానికిగాను 5వేల977 సంఘాలకు రూ.358.58 కోట్లు బ్యాంక్ లింకేజీ లక్ష్యంగా నిర్దేశించగా 6వేల606 సంఘాలకు రూ.420.18 కోట్లు ఇప్పించామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్‌డి ఇనిస్టిట్యూట్‌లో జరిగిన బ్యాంక్ లింకేజీ 2024-25 ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళిక కార్యక్రమంలో జిల్లాలో సాధించిన ప్రగతికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి బి.వెంకటేశ్వర్లు, డిపిఎం(ఎఫ్ఐ)జి.స్వర్ణలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు డి.రాజేశ్వరి, కార్యదర్శి ఎ.అనిత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర బృందం

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు సురేందర్ శనివారం పరిశీలించారు. మొదటగా మూడో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లల బరువు, ఎత్తు, పౌష్టికాహారం రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు వారికి అందుతున్న ఆహారం పట్ల అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు పట్ల శ్రద్ధ కనబరచాలని అంగన్‌వాడీ టీచర్ మంజులకు సూచించారు. పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ప్రోటీన్స్ విటమిన్స్ గల ఆహారాన్ని తప్పకుండా అందించి వారి పెరుగుదలను పర్యవేక్షించాలనీ కోరారు. అధికారి వెంట సీడీపీఓ నర్సమ్మ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ రమణ, పద్మ ఉన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో సాముహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-లోకేశ్వరం

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండలంలోని కన్నపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.ప్రభాకర్, ఉపాధ్యాయులు ఎం.రవీందర్, కే.రజిత, ప్రభ, వీఓ బైరి లక్ష్మి, పోశెట్టి, విద్యార్థులు పాల్గొన్నారు.



విత్తనాలు కొనే ప్రతి రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలి

నవతెలంగాణ-బోథ్

విత్తనాలు కొనే ప్రతి రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఏడీఏ పుల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కోరమండల్ దుకాణంతో పాటు పలు సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలను డీఏఓ పుల్లయ్య ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పలు దుకాణాల్లో సీడ్స్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, మందులు నిల్వలను రోజువారిగా బోర్డుపై వివరాలు నమోదు చేయాలని అన్నారు. ప్రభుత్వం ఆమోద పరిచిన మందులను విక్రయించాలని సూచించారు. ఎవరైనా అనుమతి లేని మందులు విక్రయించిన దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు ప్రతి ఒక్కరికి రశీదు ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా అవకతవకతలు జరిగినచో శాఖ పరంగా చర్యలు తీసుకొని, కేసులు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీధర్, ఏఓ రమేష్ కుమార్, ఏఈఓ శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ.. దొంగ అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. హుండీలో రూ.10వేల వరకు నగదు దొంగతనమైనట్లు శనివారం ఆలయ ఈఓ భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పీఎస్‌లో కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో ఐడీ పార్టీ కానిస్టేబుల్ హనుమంత్ సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగ విఠల్ జాడేను రైల్వేస్టేషన్ వద్ద చాకచక్యంగా పట్టుకొని రూ.8వేల100 రికవరీ చేశారు. దొంగ మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

టీయూటీఎఫ్ సంఘ భవనంలో వెబ్ అప్షన్ల ప్రక్రియ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా వెబ్ ఆప్షన్ లు పెట్టుకునే అవకాశం శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కాగా, ఆదివారం ఉదయం 10 గంటలకు వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని టీయూటీఎఫ్ సంఘ భవనంలో వెబ్ అప్షన్లు ఉచితంగా పెట్టుకునే అవకాశం ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్ తెలిపారు. ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుమతి లేని కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడం సాయికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న చర్యలు తీసుకోకుండా విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. పాఠశాలలో నర్సరీ నుండే వేలకు వేలు ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రధానకార్యదర్శి కుమ్ర అశోక్, ఉపాధ్యక్షులు కోరింగా రవీందర్, రాజు, రవి పాల్గొన్నారు.

సిరిపెల్లి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన సీఐ

నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సిరిపెల్లి చెక్‌పోస్టును శనివారం బైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై రవీందర్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ నైలు మాట్లాడుతూ సోమవారం ముస్లింల పండగ బక్రీద్ పండగ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ నుంచి వాహనాల్లో ఆవులను తరలించకుండా చూడాలని చెక్ పోస్ట్ సిబ్బందికి తెలిపారు. అదే విధంగా అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరిని తనిఖీ చేసేలా చూడాలని అన్నారు. ఆయన వెంట ఏఎస్సై లతీఫ్, శివయ్య, పోలిస్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన జాదవ్ గజేందర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యాడు. కాగా శనివారం కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి నాగల్‌కొండలోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పోలీసులతో ఫోన్ చేసి, హత్య జరగడానికి గల కారణాలను తెలుసుకుని, హత్య చేసిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి, శిక్ష నుంచి తప్పించుకోకుండ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు అయ్యేలా చూడాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు పునరావత్తం కాకుండా చూడాలని తెలిపారు. హత్యకు గురైన బాధితుడి ఆస్తులు మొత్తం కుటుంబ సభ్యులకు అందేలా చూస్తామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. పరామర్శ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, కోఆప్షన్ మెంబర్ దస్తగిరి, రాథోడ్ ఉత్తం, నర్సింగ్ మోరే, జాకీరుల్లఖాన్, బ్రిజులాల్, రాథోడ్ శేషరావ్, కొరాల మహేందర్, కరీంఖాన్, నసీర్ ఉన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కే.సర్దార్ అన్నారు. శనివారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న పంటల ప్రణాళిక ప్రకటించలేదనీ అన్నారు. ఇది కొత్త సర్కార్ నిర్లక్ష్యం ధోరణికి నిదర్శనమని అన్నారు. విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు నకిలీలు అమ్మకుండా వ్యవసాయాధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజు, జిల్లా ఉపాధ్యక్షులు గోపి నర్సయ్య, సహాయ కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, గజ్జన్న, గుట్ల ప్రసాద్, గొనె స్వామి, కుడుదుల రాజేష్, మాస్క శ్రీనివాస్, గోగు శేఖర్, మండల నాయకులు గంగన్న పాల్గొన్నారు.

ఎంపీ గోడం నగేష్‌ను కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్‌ను శనివారం ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సార్మేడి సలాం శ్యామ్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని ఎంపీపీ కోరారు. ఎంపీని కలిసిన వారిలో ఆత్రం లచ్చు పటేల్, దంతన్‌పల్లి ఎంపీటీసీ కొడప భీంరావ్, గేడం ఈశ్వర్, పొన్నం సాయికుమార్, యశ్వంత్ రావు పటేల్ ఉన్నారు.

కాలినడకన తిరిగి.. సమస్యలు తెలుసుకొని..

- పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ భరోసా



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాలనీలలో నెలకొన్న నీటి, కరెంటు, రోడ్డు, మురికి కాలువల సమస్యలను తెలుసుకొనేందుకు శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఉదయం కాలినడకన తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. అందులో భాగంగా గోండుగూడ, మిలిందనగర్, గజానంద్‌నగర్, బుద్ధనగర్, బజార్‌గల్లీ, ప్రబుద్ధనగర్, రాంనగర్, భీంనగర్, వడ్డెరగల్లీ, పూలాజీ బాబానగర్, కొబ్బాయిగూడ తదితర కాలనీల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు కార్యక్రమం నిర్వహించారు. వాడల్లో నెలకొన్న సమస్యలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో పేదలను గుర్తించి, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన 4 నెలల్లోనే మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.5వందలకే గ్యాస్, ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు చికిత్సకు అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. త్వరలో మహిళలకు రూ.2వేల 5వందలు, వృద్దులకు, వితంతువులకు, అంగవైకల్యం చెందిన వారికి రూ.4వేల చొప్పున పెన్షన్ మంజూరు చేస్తామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుందని, చేసేదే చెప్తుందన్నారు.

రైతులకు లాభం చేకూర్చాలి...

మండలంలోని వెటర్నరీ పశు వైద్యశాలలో నడుస్తున్న విజయ డెయిరీ పాల కేంద్రాన్ని సందర్శించి, రైతులు వద్ద కొనుగోలు చేస్తున్న పాల క్రయ విక్రయాల వివరాలను డెయిరీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అన్ని విధాలుగా లాభం చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

రైతన్నకు ఆదిలోనే కష్టాలు..

- రుతుపవనాల జాడేది
- వరుణుడి కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆరుగాలం కష్టించి అప్పు చేసి, రైతులు విత్తనాలు విత్తుకున్నారు. వరుణుడి రాక కోసం వెయికండ్లతో ఎదురుచూస్తున్నారు. అక్కడక్కడ చెదురు ముదురు జల్లులే తప్పా ఆశించిన స్థాయిలో ఒక మోస్తరు వర్షం ఇంత వరకు కురువలేదు. దీంతో రైతన్నకు ఆదిలోనే కష్టాలు వెంటాడుతున్నాయి. మండలంలో ఈ ఖరీఫ్‌లో 20,926 ఎకరాల్లో పత్తి పంటను వేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. దుక్కి దున్ని పంట సాగుకై సమాయత్తమైన రైతన్న పత్తి విత్తనాలు విత్తుటలో నిమగ్నమయ్యాడు. జూన్ సగం నెల దాటుతున్న ఇంతవరకు మోస్తారు వర్షం పడలేదు. ఒక వైపు ఉక్కపోత, మరో వైపు కారు మబ్బులతో కూడిన ఆకాశంతో రైతన్న వెయి కండ్లతో వర్షం కోసం ఎదురు చూస్తున్నాడు. దీంతో చేసేదేమీ లేక రైతన్న స్ప్రింకర్ల సహాయంతో నీటిని అందిస్తూ విత్తనానికి ప్రాణం పోస్తున్నాడు. ఇంకో రెండు, మూడు రోజులు వర్షం పడక పోతే పెట్టిన విత్తనాలు నష్ట పోయే ఆ ఆకాశం ఉందని రైతన్న లబోదిబోమంటున్నారు. గతంలో కంటే ఈ ఏడు విత్తనాల ధరలు భారీగా పెరిగాయని, మరోవైపు నైరుతి రుతుపవనాల జాడ జిల్లాల్లో కరుణించక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

స్ప్రింక్లర్ల సాయంతో నీటిని అందిస్తున్నా

కనక దేవ్‌షావ్, రైతు కేస్లాగూడ



నేను నాలుగు రోజుల కింద ఆరు బ్యాగుల పత్తి విత్తనాలు విత్తాను. ఒక వర్షం మామూలుగా కురిసింది. ఇప్పుడు పత్తి విత్తనాలు ఉబ్బి నెల లోనే ఉన్నాయి. ఒక మోస్తారు వర్షం పడితే అవి మొలకెత్తుతాయి. వరుణుడు రాకా కోసం ఎదురు చూస్తున్నాం.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానికంగా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జనహృదయ నేత అని, ఎల్లప్పుడు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రతి క్షణం ఆలోచన చేస్తారన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని తెలిపారు. అనంతరం నీట్‌లో ర్యాంక్ సాధించిన ముజమీల్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, జాకిరూల్లాఖాన్, కరీంఖాన్, ఉత్తం, యూసుబ్, హుస్సేన్, గోవింద్‌రావ్, నసీర్, కార్తీక్, దేవిదాస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

బ్యాంకు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం

బ్యాంకులలో అందించే బీమా సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో మాట్లాడారు. ఖాతాదారులకు బీమా సౌకర్యాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ ఆయా బ్యాంకులలో బీమా చేయించుకోవాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే బీమా ఆవశ్యకత పట్ల ఖాతాదారులకు వివరించారు. ప్రతి ఒక్కరూ బీమా పాలసీ కలిగి ఉండి, తమ కుటుంబానికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మండల కేంద్రంలో బీమా పొందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందగా వారి కుటుంబానికి రూ.20లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ అబ్రహం, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అంజాచారి, ఏపీఎం రాజారాం, బ్యాంక్ అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : ఎంపీడీఓ

నవతెలంగాణ-లోకేశ్వరం

మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సోలోమన్ రాజ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ ఇంటింటి నల్లా సర్వే తీరును ఆయన పరిశీలించారు. మిషన్ భగీరథ నీళ్ల వస్తున్నాయా, వస్తే ఎన్ని వస్తున్నాయి. ఎంత సేపు వస్తున్నాయని ఆరా తీశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గంధం వినయ్‌సాయి, ఐకేపీ వీఓఏ రాజు ఉన్నారు.

కేసులు పెట్టి బెయిల్ రాకుండా చేస్తున్నారు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సందర్భంగా మే 9న భైంసాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై హనుమాన్ దీక్షపరులు కోడి కోడ్లతో దాడి చేశారని పోలీసులు కేసులు పెట్టి బెయిల్ రాకుండా చేస్తున్నారని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదిలాబాద్, భైంసా ఎమ్మెల్యేలు పాయల శంకర్, రామారావ్ పటేల్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా భైంసాలో హనుమాన్ దీక్ష పరులు శాంతియుతంగా హిందూ సంస్కృతిపై విష ప్రచారంపై కేటీఆర్ రోడ్ షోలో నిరసన తెలిపారన్నారు. కానీ పోలీసులు మారణాయుధాలు వెంట పెట్టుకొని, కోడి గుడ్లతో దాడి చేశారని కేసులు నమోదు చేశారన్నారు. బైండోవర్ కింద స్టేషన్‌లో ఉన్న వారికి కక్ష్యపూరితంగా కేసులో ఇరికించారని ఆరోపించారు. హిందుధర్మం, సంస్కృతిని, సంప్రదాయాలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్న కేటీఆర్‌పై శాంతియుతంగానే నిరసన తెలిపారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ కూడా హిందువులపై తప్పుడు కేసులు బనాయిస్తుందన్నారు. బీఆర్ఎస్ పట్టిన గతి రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. జైనూర్ సంఘటనపై ఇప్పటి వరకు పోలీసులు నిందితులను వెతుకునే ఉన్నారని, అదే భైంసా కేసుల్లో క్షణాల్లో పట్టుకున్నారని తెలిపారు. ఓ వర్గానికి ప్రభుత్వం, పోలీసులు అండగా ఉన్నట్లు తాము భావిస్తున్నామన్నారు.

కేజీబీవీలో సీట్లను పెంచాలి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో ఉన్న కస్తూర్బా పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగరి వెంకటేష్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. విద్యార్థులకు సరిపడే సీట్లను పెంచాలని, చాలామంది విద్యార్థులు సీట్లు లేవని వెనుదిరిగి పోతున్నారని పేర్కొన్నారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సీట్ల పెంపు పై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, తగు చర్యలు చేపట్టాలని కోరారు.

నిర్మల్ కలెక్టర్‌గా అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



నూతన నిర్మల్ కలెక్టర్‌గా అభిలాష అభినవ్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. అభిలాష అభినవ్ ఇదివరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) జోనల్ కమిషనర్‌గా ఆమె పని చేశారు. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన నూతన కలెక్టర్ గతంలో 2019లో ఆదిలాబాద్ జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పొందారు.

కలెక్టర్ రాజర్షిషాకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024 లోక్ సభ సాధారణ ఎన్నికలను జిల్లాలో నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కౌంటింగ్ వరకు తనదైన శైలిలో ప్రతి అంశంలో చురుకైన పాత్ర పోషించి, ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా కలెక్టర్ రాజర్షిషా విజయవంతంగా పూర్తి చేశారని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ నుండి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను జిల్లా రెవెన్యూ సిబ్బంది, జిల్లా పౌర సంబంధాల అధికారి శాలువాతో సన్మానించి, పూలబొకేను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, అధికారులు ప్రజప్రతినిధులు, మీడియా సహాయ సహకారాలు, సమిష్టి కృషి వల్లే ఎన్నికలను దిగ్విజయంగా పారదర్శంగా నిర్వహించామని అన్నారు. మనందరం ఇదే సమిష్టి కృషి సమన్వయంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేసి జిల్లాను అభివృద్ధిలో రోల్ మోడల్‌గా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో తిరుమల, ఏఓ అరవింద్, ఎన్నికల సూపరింటెండెంట్ నలంద ప్రియ, తహసీల్దార్ రాజేశ్వర్ ఉన్నారు.

మంత్రిని కలిసిన బోథ్ నియోజకవర్గ నాయకులు

నవతెలంగాణ-ఇచ్చోడ

పోడు వ్యవసాయ భుముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్‌తో కలిసి అటవీశాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఇచ్చోడ మండలంలోని సిరిచేల్మ కంపార్ట్మెంట్ నెంబరు 174లో గల పోడు వ్యవసాయ భూముల బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సిరిచేల్మ అబ్దుల్ అజీమ్, కేశపట్నం కాంగ్రెస్ నాయకుడు షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పార్డి(బి) గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..పార్డి(బి) గ్రామానికి చెందిన కొంగర్ల లక్ష్మణ్(55) గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై జీవితం మీద విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఉన్న దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు.

రిపోర్టర్లపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల నేపథ్యంలో రిపోర్టర్లు కథనాలపై అధికార పార్టీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అట్రాసిటీ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ప్రభుత్వంతో పాటు డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్టు ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇటీవల ఓ రిపోర్టర్‌పై ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదును ఎంపీ నగేష్‌తో కలిసి ఖండించారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన పాత్రికేయులపై కక్ష్యసాధింపులకు పాల్పడటం సరికాదన్నారు. వార్తపై కాంగ్రెస్ నాయకులు సంబంధిత రిపోర్టర్‌పై అట్రాసిటి కేసు పెట్టడం, పోలీసులు అత్యుత్సహం ప్రదర్శించడం సరైంది కాదన్నారు. అధికార పార్టీకి తలోగ్గి పోలీసులు కూడా పరిధిని మరిచిపోవద్దన్నారు. ఈ ఘటనపై పార్టీ పరంగా రిపోర్టలకు అండగా ఉంటునే డీజీపీకి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలను జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి తినిపించుకుంటూ డిప్యూటి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలను ఆయన మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేశంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పార్టీ కార్యకర్తలు మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, నాయకులు లక్ష్మణ్, ఏవన్, వెంకట్‌రెడ్డి, ఖయ్యుం, ప్రవీణ్‌రెడ్డి, గంగారెడ్డి, శ్రీలేఖ, ఖయ్యుం పాల్గొన్నారు.

ఉట్నూర్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మల్లు భట్టి విక్రమార్క ధృఢ సంకల్పంతో కొన్ని వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మల్లు భట్టివిక్రమార్కకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-కౌటాల



జాతీయ ఉపకార వేతనానికి మండలంలోని ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గావుడె హనుమంతు తెలిపారు. పాఠశాలకు చెందిన రౌతు గోపిక, చిలువేరు లావణ్య ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. గత సంవత్సరం జాతీయ ఉపకార వేతనం అర్హత పరీక్ష రాయగా ఎంపికైనట్లు ఫలితాలు వచ్చాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదవ తరగతి నుంచి పన్నెండవ తరగతి వరకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాలు కలిపి మొత్తం రూ.88వ0ల ఉపకార వేతనం వస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

గాయపడిన మాజీ సర్పంచ్‌కు పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రెబ్బెన మండలం గోలేటి మాజీ సర్పంచ్ సొల్లు లక్ష్మి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా జడ్పీటీసీ నాగేశ్వరరావు ఆస్పత్రికెళ్లి ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట డా.కృష్ణ ఉన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌కు చెందిన బీజేపీ నాయకురాలు పుష్ప కుమారుడు కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఎగ్గర్స్ శ్రీకాంత్, సత్తయ్య పాల్గొన్నారు.

బాధితులకు పరిహారంపై సమన్వయంతో పనిచేయాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ కేసులకు సంబంధించి బాధితులకు అందజేసే పరిహారంపై పోలీస్ అధికారులతో పాటు జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు లిగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. బాధితులకు వివిధ కేసులకు సంబంధించి అందజేసే నష్టపరిహారంపై పోలీస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులలో బాధితులకు త్వరగా నష్టపరిహారం వచ్చేలా చూడాలని సూచించారు. మహిళలకు నష్టపరిహారం ఆలస్యం కాకుండా సంక్షేమ శాఖ అధికారులతో, పోలీసులు సమన్వయం చేసుకోవాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్, ఎస్సై రాజేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో తాగునీటి వసతులు కల్పించాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తుంగడ గ్రామ ఎంపీపీఎస్, జడీటెస్ఎస్ పాఠశాలల్లో తాగునీటి వసతులను కల్పించాలని ఎంపీపీ సౌందర్య అన్నారు. శనివారం ఆ పాఠశాలల్లో నూతన బోర్వెల్ మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కోవ లక్ష్మికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సౌందర్య మాట్లాడుతూ తుంగెడ గ్రామంలో ఎంపీపీఎస్, జడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో సుమారు 200 విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వారికి తాగేందు, మరుగుదొడ్లకు కూడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ పాఠశాలల్లో బోర్వేల్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేను విన్నవించడం జరిగిందని, ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్, బీఆర్ఎస్ యువ నాయకులు జిమ్మిడి ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ పోస్ట్ మెట్రిక్ కళాశాల హాస్టల్‌ని ప్రారంభించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాంకిడి మండలంలోని ఎస్సీ పోస్ట్ మెట్రిక్ కళాశాల హాస్టల్‌ను ప్రారంభించాలని, ఆసిఫాబాద్ ఎస్సీ ప్రిమెట్రిక్ హాస్టల్‌కు అదనపు గదుల కోసం నిధులు మంజూరు చేసి నిర్మించాలని డివైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాంకిడి మండలంలో తెలంగాణ మోడల్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 500 మంది విద్యార్థులకుపైగా చదువుతున్నారని, దూర ప్రాంతాల నుండి వచ్చి చదువుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. ప్రస్తుతం వాంకిడి మండల కేంద్రంలో ఉన్న ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో పోస్ట్ మెట్రిక్ కళాశాల ప్రారంభించాలని కోరారు. ఆసిఫాబాద్ ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో 100కు పైగా విద్యార్థులున్నారని వారికి గదులు సరిపోవడం లేదన్నారు. విద్యార్థుల కోసం అదనపు గదులను నిర్మించాలని కోరారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులకు అండగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలు ఉంటేనే అన్‌ఫిట్

నవతెలంగాణ-రెబ్బెన

అనారోగ్య కారణాల వల్ల ఉద్యోగం చేయలేకపోతున్న కార్మికుల కోసం ప్రతినెల నిర్వహించే మెడికల్ బోర్డును అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న ప్రతి కార్మికుడిని అన్ ఫిట్ చేయడం జరుగుతుందని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు కార్మికుల వద్దకు వెళ్లి మెడికల్ బోర్డులో ఎలాగైనా అన్ ఫిట్ చేయిస్తామని, వారసులకు ఉద్యోగాలు పెట్టిస్తామని ప్రలోభపెడుతున్నట్లు తెలిందన్నారు. అలాంటి వారిని నమ్మవద్దని తెలిపారు. సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి మేరకు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), నేర దర్యాప్తు సంస్థ(సీఐడీ)లు కూడా సింగరేణి మెడికల్ బోర్డుపై ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. మాయ మాటలతో మోసగిస్తున్నట్టు సమాచారం ఉంటే వివరాలను సింగరేణి విజిలెన్స్ అధికారులకు 9491144104 నెంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్ ద్వారానైనా తెలియజేయాలని కోరారు.

19న కాగజ్‌నగర్‌లో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రముఖ కంపెనీలలో ఉద్యోగావకాశాలుఎ కల్పించేందుకు ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహకారంతో ఈనెల 19న కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులు ఐసీఐసీఐ బ్యాంకులో ఖాళీలు 50, యెస్ బ్యాంక్‌లో 50 ఖాళీలు ఉన్నాయని, ఏదయినా డిగ్రీ, 28 సంవత్సరాలలోపు వయోపరిమితి గల అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 19న ఉదయం 11 గంటలకు విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు బయోడేటాతో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు ఫోన్.నెం. 9908187894, 9440514962 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు సంబంధించిన పనులపై అదనపు కలెక్టర్ దీపక్ తివారితో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నాలుగురోజులు పూర్తయ్యాయని, పాఠశాలల అభివృద్ధి కింద చేపట్టిన పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, గదుల మరమ్మతుల పనులు సత్వరమే పూర్తిచేయాలని తెలిపారు. ఇప్పటి వరకు అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద చేపట్టిన పనుల ఎంబీ రికార్డులు పూర్తిచేయాలన్నారు. విద్యుత్ సరఫరాలేని పాఠశాలల వివరాలను సమర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించని చోట త్వరగా అందించాలని చెప్పారు. పనుల పురోగతిపై విద్యాశాఖ అధికారులు, ఇంజనీర్లను మండలాల వారీగా అడిగి తెలుసుకుని తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వాటిని బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటే ధోత్రె అన్నారు. మండలంలోని తుంపల్లి పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని విద్యార్థుల సంఖ్యనుపెంచాలన్నారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. వర్షాలు కురిసినపుడు పాఠశాల భవనం పైకప్పు కురుస్తుందని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు తెలపడంతో కలెక్టర్ స్పందించి డాంబర్ షీట్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



తుంపల్లిలో డాంబర్ షీట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అన్నారు. బడిబట కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని జనకాపూర్ పాఠశాలలో జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు ఉంటున్నాయని, ప్రయివేట్ పాఠశాలలతో పోలిస్తే నాణ్యమైన విద్య బోధన ఉంటుందన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉదయ్‌బాబు, నాయకులు సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్థానిక పోరుపై ఎదురుచూపులు..!

- రిజర్వేషన్లపై స్పష్టతనివ్వని ప్రభుత్వం
- ఆశావాహుల్లో ఉత్కంఠ

నవతెలంగాణ - వాంకిడి

గడువు తీరిన గ్రామ పంచాయతీ పాలకవర్గం ఎన్నికకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలాలేదు. ఈ జూన్‌లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని అప్పట్లో సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించిన ఆ దిశగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు అడుగులు పడడంలేదు. గత ఫిబ్రవరి ఒకటిన పంచాయతీ పాలకవర్గం పదవికాలం ముగిసింది. ఆ సమయంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రిని సిద్ధం చేశారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ బీసీ రిజర్వేషన్‌ల విషయంలో తేలకపోవడంతో కులగణ డిమాండ్ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో పంచాయతీల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌లు కొనసాగిస్తారా, మారుస్తారా అనే చర్చలు గ్రామ పంచాయతీల అంతటా జరుగుతున్నట్టు తెలుస్తుంది.

2019 ఎన్నికలు ఇలా...

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం 2018 అమల్లోకి తీసుకొచ్చి 2019లో సర్పంచ్ ఎన్నికలకు నిర్వహించింది. జనవరి ఒకటిన ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ వెలువడింది. జనవరి 21, 25, 35వ తేదీల్లో మూడు దశల్లో పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటిన సర్పంచ్‌లు, వార్డుసభ్యులు బాధ్యతలు స్వీకరించారు. 2024 ఫిబ్రవరి ఒకటితో సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో జిల్లాలోని 335 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన బాధ్యతలు చేపట్టారు. 2019 ఆగస్టులో రాష్ట్రంలో తొలిసారిగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన రాగా తాజాగా మరోసారి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన రావడం ఇది రెండోసారి.

రిజర్వేషన్ అడ్డంకిగా...

గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్‌లు ప్రధానంగా అడ్డంకిగా మారాయి. గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పంచాయతీ రాజ్ చట్టం 2018 ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్‌లు ఐదేండ్ల పాటు వర్తిస్తాయని పేర్కొంది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాత రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా.. ? లేక ఏదైనా మార్పులు చేస్తుందా.. ? అనే ఆసక్తి తర్వాత నెలకొంది. ఒకవేళ చట్టాల్లో మార్పు చేస్తే జనాభా ప్రతిపాదన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, సామాజిక వర్గాలకు రిజర్వేషన్‌లు కేటాయించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రస్తుత చట్టంలో మార్పులు చేయాలి. అదీ జరుగకుంటే మరో కొత్త చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. ఈ మొత్తం ప్రక్రియ జరగాలంటే చాలా సమయం పడుతుంది. మరో వైపు బీసీ గణన తదితర కార్యక్రమాలతో స్థానిక సంగ్రామం ఆలస్యం కావచ్చునేమోనని చర్చలు అన్ని రాజకీయ వర్గాల్లో కొనసాగుతుంది. ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉండడంతో ముందుకెళ్లాల, రిజర్వేషన్ మారితే ఖరారైన తర్వాత అడుగు ముందుకు వేయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఒకవేళ రిజర్వేషన్ మారితే పెట్టిన ఖర్చు వృథా అవుతుందేమోనని ఆశాభావులు ఆలోచిస్తున్నారు. చాలామంది ఆయా గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్‌లు వస్తే కొత్త వారు బరిలోకి దిగడానికి ఎదురుచూస్తున్నారు. యువకులు కూడా సర్పంచ్ కావాలని ముందుకు వస్తున్నట్టు ఆయా గ్రామ పంచాయతీల్లో చర్చలు జరుగుతున్నాయి. ఏదెలా ఉన్నా ఎన్నికలు జరగాలని అందరు ఎదురుచూస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో టెన్షన్ టెన్షన్‌గా ఉన్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ సర్పంచ్‌లుగా చాలామంది గెలిచారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మళ్లీ రిజర్వేషన్ల మార్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.



వాంకిడి గ్రామపంచాయతీ భవనం

త్వరతగతిన భగీరథ ఇంటింటి సర్వే పూర్తిచేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకే చేపడుతున్న మిషన్ భగీరథ సర్వే త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ గ్రామంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పర్యటించి మిషన్ భగీరథ నల్లాల ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించేందుకు సర్వే చేపడుతున్నామని, సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, తప్పులు దొర్లకుండా త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి నల్లా కనెక్షన్లు కలిగిన నివాస గృహాలు, ఇంకా ఇవ్వాల్సిన ఇండ్ల వివరాలన్నీ నమోదు చేయాలన్నారు. వర్షాకాలం వస్తున్నందున మురికి కాలువలు, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశమున్నందున ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలున్నయని దోమతెరలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మిషన్ భగీరథ సహాయ ఇంజనీర్ శైలేందర్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- విత్తన దుకాణాలను తనిఖీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలం బూరుగూడ మెయిన్ రోడ్డుపై గల కళావతి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల గోదాం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ నిర్ణయించిన ధరలకే విత్తనాలను, ఎరువులను విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. విత్తనాలను, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలరు లైసెన్సు, దుకాణం అనుమతి వివరాలు, స్టాకు నిలువ, ధరల పట్టికను షాపు ముందు బోర్డుపై ఉంచాలన్నారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదును ఇవ్వాఆలన్నారు. నకిలీ విత్తనాల విక్రయాల వల్ల రైతులు నష్టపోతే డీలర్లు, సంబంధిత కంపెనీ యజమానులపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. రైతులు విత్తనాల ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని, ఒకవేళ రైతు నష్టపోతే ఆయా కంపెనీల నుండి నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అక్కడే విత్తనాలు కొనుగోలు చేసిన రైతును తెలుసుకోగా డీలర్లు విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రశీదులో ఉన్న రైతుల ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి ఎవరెవరికి ఎంత ఎక్కువ ధరలకు విక్రయించారో వారి వివరాలను వెంటనే తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ, పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సమన్వయం చేసుకుని జిల్లాలో నకిలీ విత్తనాల రవాణ, విక్రయాలు అరికట్టాలన్నారు. అదే విధంగా రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన వారిపై చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. రైతులు ఎవరు కూడా లూస్ విత్తనాలు కొనుగోళు చేయవద్దని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు మండల వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు మిలింద్ కుమార్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వేంకటేష్ ధోత్రే

మైనార్ బాలిక హత్య కేసులో నిందితుని శిక్షించాలి

- అరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోటుపెల్లి జైరాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కాటపల్లి గ్రామంలో మైనార్ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోటుపెల్లి జైరాం డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులతో కలిసి ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపెల్లిలో దహెగాం మండలానికి చెందిన ఏల్కరి మహేష్ ఆరు సంవత్సరాల పసిపాపను అత్యాచారం చేసి హత్య చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. నిందితులను శిక్షించే వరకు బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కాజీ, ఆసిఫాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు బోటుపెల్లి అన్నారావ్, ప్రధాన కార్యదర్శి నాగపూరి మారుతి, ప్రచార కార్యదర్శి కరట్కార్ రమేష్, కోశాధికారి ఎలుములే దిలీప్, సహాయ కార్యదర్శి బొట్టుపెల్లి ప్రశాంత్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి దనపెల్లి శ్యామరావ్, నాయకులు లోఖండే మోహన్, బుజడి వెంకన్న, సప్తే బాలకిషన్, కోలే బిజ్జు, కూరత్కర్ జిమ్నాజి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

మంచిర్యాల నూతన కలెక్టర్‌గా కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల నూతన కలెక్టర్‌గా కుమార్ దీపక్‌ను నియమిస్తున్నట్లు సీఎస్ శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2018 బ్యాచ్ కు చెందిన కుమార్ దీపక్ నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించి మంచిర్యాలకు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుత కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బదావత్ సంతోష్‌ను నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. 2023 ఫిబ్రవరిలో బాధ్యతలు స్వీకరించిన సంతోష్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో తనదైన పాత్ర నిర్వహించాడని పలువురు అభినందించారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేట మున్సిపల్ పాలకవర్గ సాదరణ సమావేశాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షెట్టిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ ముందుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎజెండా అంశాలు కౌన్సిల్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ఇట్టి కార్యక్రమంలో రానున్న వర్ష కాలం దృష్ట్యా తీసుకోవలసిన చర్యల గురించి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్స్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లాలోని 8 పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న సుమారు 50 మంది కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు సంబంధించిన పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి బ్రహ్మానందం మాట్లాడుతూ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ (ఎస్సీడీడీ)లో కొనసాగుతున్న పోస్టు మెట్రిక్ హాస్టల్ వర్కర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం గత 5 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, జనవరి నెలలో కేవలం 5 హాస్టల్‌లకు మాత్రమే బిల్ చేయడం జరిగిందన్నారు. ఫిబ్రవరి, మార్చ్, ఏప్రిల్ బిల్లులు ఇంకా రాలేదని బడ్జెట్ వచ్చాక చూస్తామని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఈ రకంగా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్ మెంట్ డిపార్ట్మెంట్ పరిధిలో కొనసాగుతున్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న హాస్టల్ వర్కర్స్ పరిస్థితి చాలా అధ్వానంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చి డైరెక్ట్‌గా ప్రతినెల వేతనాలు చెల్లించలన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్, వెంకటేష్, కృష్ణ, జనార్ధన్, రాజేశ్వరి, అనిత, పి లక్ష్మి, హేమలత, మంజుల, అంజలి, దుర్గ, సుజాత, సునీత, లక్ష్మి, పద్మ, ప్రేమలత, అనసూర్య, టి లక్ష్మి, కె లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

- అక్రమ కలప రవాణా చేస్తే కఠిన చర్యలు
- ఎఫ్ఆర్ఓ సుష్మారావు

నవతెలంగాణ-జన్నారం



అడవుల సంరక్షణ మన అందరి బాధ్యత అని జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జీడీసీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అడవుల సంరక్షణలో అటవీ శాఖ అధికారులే కాకుండా ప్రజలందరూ భాగస్వాములైనప్పుడే వాటిని కాపాడుకోవచ్చని అన్నారు. చెట్లను పెంచడం వలన భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని, చెట్లను నరికివేయకుండా కాపాడే బాధ్యత మన అందరి మీద ఉందని అన్నారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, గడ్డి క్షేత్రాలు పెంచామని, సోలార్ సాసర్ పిట్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ మధ్యప్రదేశ్, కేరళలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌ల మాదిరిగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అంతేకాకుండా అక్రమ కలప రవాణా చేసిన, నిలువ ఉంచిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవులు సమృద్ధిగా పెంచడం వల్ల అడవుల్లో ఉండే జీవజాతులు, పక్షులు స్వేచ్ఛగా విహరిస్తూ, వాతావరణ సమతుల్యతకు తోడ్పడతాయన్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో దాడులు నిర్వహించి స్మగ్లర్లపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో అటవీ శాఖ సిబ్బంది శేష రావు, గోపి కృష్ణ, శ్రీనివాస్, రహీమోద్దీన్, తిరుపతి పాల్గొన్నారు.

కల్యాణిఖని-5 గని సంర్శన



నవతెలంగాణ-మందమర్రి

కల్యాణిఖని 5 గనిని ఏఐటీయూసీ నాయకులు శనివారం సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ అండర్ గ్రౌండ్‌లో దిగి కార్మికుల పని స్థలాలు, పనిముట్లు, గాలి నీరు రక్షణకు సంబంధించిన విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. 4 సీమ్‌లో గాలి సరఫరా తక్కువగా ఉందని 29 ఎల్ఎస్ 7డి దగ్గర దిమ్మలు కార్నర్ ప్రాప్స్ లేవని, 3డి/26ఎల్ ట్రాక్ లైన్ సరిగ్గా లేదని అదేవిధంగా ఎస్‌డీఎల్ యంత్రాలు సరిగా పనిచేయడం లేదన్నారు. కార్మికులు తెలిపిన సమస్యలను గని మేనేజర్ అల్లా ఉద్దీన్‌కి తెలుపగా వారు సానుకూలంగా స్పందించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ సోమిశెట్టి రాజేశం, కెకె 5 గని ఇన్‌చార్జి కంది శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ గాండ్ల సంపత్, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ విక్రమ్ సింగ్, సేఫ్టీ సభ్యులు కుమారస్వామి, మేకల సంతు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శనివారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ముజాఫరాలి, నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ పేదల పక్షాన పేదల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న భట్టి విక్రమార్క ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకల మాణిక్యం, సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య, సంద సుదర్శన్, దాముక కరుణాకర్, బాదావత్ సుధాకర్ నాయక్, రియాసత్ అలీ, దుర్గం గంగాధర్, పాదం రాకేష్, కండ్లే చంద్రయ్య, బోడ శంకర్, షాహిన్ సుల్తానా, ఎల్లా లావణ్య పాల్గొన్నారు.

రేండ్లగూడ పశువుల సంత వేలం వాయిదా

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ(మందపల్లి) గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంత వేలం పాటను ఈ నెల 19కి వాయిదా వేసినట్లు గ్రామ స్పెషల్ ఆఫీసర్ కస్తూరి శ్రీకాంత్, ఈఓపీఆర్డీ రమేష్, గ్రామ కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాటకు ఒక్కరే దరఖాస్తు దాఖలు చేయడంతో పంచాయతీ నిబంధనలను అనుసరించి వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ వేలం పాటను ఈనెల 19 బుధవారం నాడు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేలం పాటలో అధిక సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై చర్చ

- జడ్పీ సమావేశంలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్
- రైస్ మిల్లర్ల వివరాలు ఇవ్వాలని అధికారులకు సూచన



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చర్చకు వచ్చింది. శనివారం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశం జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలకు సంబంధించిన అంశాలను చర్చకు తీసుకువచ్చారు. రైస్ మిల్లులు, వాటి నిర్వాహకుల వివరాలు తెలియజేయలని సివిల్ సప్లై అధికారులను కోరారు. 2014 నుండి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని, జిల్లాలో రైతులు విక్రయించిన ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగినయని తేమ, తరుగు పేరుతో దళారులు రూ.కోట్లు దండుకొని రైతులను నిండా ముంచారని అన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ పని చేస్తుందని, గతంలో రైస్ మిల్లులకు ఇచ్చిన ప్యాడి, సీఎంఆర్ లెక్కలు తేల్చకుండానే, ఇప్పుడు రైస్ మిల్లులకు ధాన్యాన్ని అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, జిల్లాలో రైస్ మిల్లులు ఉండగా పక్క జిల్లాల రైస్ మిల్లులకు ధాన్యాన్ని అప్పజెప్తున్నారని, జిల్లాలో గల రైస్ మిల్లులు, వాటి నిర్వాహకులు వివరాలు కావాలని కోరారు. ఘన్ని సంచులు విషయంలోను అక్రమాలు జరిగాయని, అవినీతికి పాల్పడిన రైస్ మిల్లుల యజమానులుపై చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక ధాన్యం డబ్బులు వెంటనే రైతుల అకౌంట్‌లలో జమ అయ్యాయని, పెండింగ్‌లో ఉన్న డబ్బులను త్వరలోనే రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.



అధిక ధరలకు విత్తనాలు, మందులు

ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులే విత్తనాలు, మందులు ఎంఆర్పీ ధరకంటే అధిక ధరకు విక్రయిస్తున్నారని లక్షెట్టిపేట జడ్పీటీసీ ముత్తె సత్తయ్య అన్నారు. వ్యవసాయ అదికారులు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నరని మండిపడ్డారు. నామ మాత్రంగా ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా విత్తనాల కొనుగోళ్లలో బ్లాక్ దందా జోరుగా సాగుతోందని విమర్శించారు. అధికారులు ఎవరు దానిపై ద్రుష్టి పెట్టడం లేదని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు నిద్ర వస్తలో ఉన్నారని ఆరోపించారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి నకిలీ, బ్లాక్‌లో అధిక ధరలకు విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, అదనపు కలెక్టర్ రాహుల్, బెల్లంపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు, గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు, ఆయా శాఖల అధికారులతో జడ్పీ సీఈఓ గణపతి పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడుచుకోవాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-జైపూర్



యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు సన్మార్గంలో నడుచుకుంటే భవిష్యత్తు బంగారమవుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ సూచించారు. పోలీసులు మీ కోసం కార్యక్రమం ద్వార శనివారం కోటపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువకులతో సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానికి అనుగుణంగా నడుచుకుంటే విజయం మీ సొంతమవుతుందని తెలిపారు. పోలీసులు మీ కోసమే, మీ భద్రత కొరకు మాత్రమే అన్నారు. గతంతో పోల్చికుంటే సౌకర్యాలు మెరుగుపడ్డాయని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యువత చెడు వైపు దృష్టి సారించకుండా వారితో మమేకమై కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా పోలీస్ శాఖ తరపున వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడలతో మానసికోల్లాసం, క్రీడల్లో రాణించిన వారికి ప్రత్యేక కోట ద్వార ఉద్యోగ అవకాశాల్లో ప్రదాన్యత లభిస్తుందని తెలిపారు. క్రీడాకారులకు పోలీసుల ప్రోత్సాహం ఉంటుందని, అదేవిధంగా చదువుల్లో రాణించి కన్నతల్లి తండ్రులతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. సంఘవిద్రోహ శక్తులకు దూరంగా ఉండాలని, అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని ప్రలోభాలకు గురి చేసి చెడు మార్గం వైపు నడిచేలా ప్రోత్సహిస్తారని అన్నారు. సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఆపద సమయంలో పోలీసులు అండగా అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సంధర్భంగా చెడు అలవాట్లకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటామని, సత్ప్రవర్తనతో నడుచుకుంటామని అక్కడి యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నీల్వాయి, కోటపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధి వివిధ గ్రామాల యువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్లు, జెర్సీలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, కోటపల్లి ఎస్సై రాజేందర్, నీల్వాయి ఎస్సై శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.

కొలువుదీరిన నూతన మార్కెట్ కమిటీ



మార్కెట్ కమిటీ సభ్యులతో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెటిపేట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులుగా నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం, పాలకుల వైఫల్యంతో మార్కెట్ యార్డ్ వెనుకబడిపోయిందని అన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రిజర్వేషన్లుకు అనుగుణంగా, ఎలాంటి తారతమ్యాలు లేకుండా సమన్యాయం పాటిస్తూ పాలకవర్గం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వ దోపిడీ కారణంగా రైతులు చాలా నష్టపోయారని, ఇకనుంచి అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, ఒక గింజ కూడా తరుగు లేకుండా రైతుకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి రైతుకు సాగునీరు అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు. రాబోవు రెండు సంవత్సరాలలో వైద్య, విద్యారంగంలో మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేసి ప్రతి పేదవాడు ఉన్నత విద్య చదువుకునేలా కృషి చేస్తానని తెలిపారు. గతంలో కాంగ్రెస్ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. యువతకు ఇంక పెద్దపీట వేస్తానని తెలిపారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

నూతన పాలకవర్గ సభ్యులు..

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా దాసరి ప్రేమ్ చంద్, వైస్ చైర్మన్‌గా ఎండీ ఆరిఫ్ ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ సభ్యులుగా విజయ్ కుమార్, కనక జంగు, కట్కూరి రాజన్న, గోపతి సునీత, తోట రమేష్, పలుసాని రవీందర్‌రావు, బండ రాకేష్, బొప్పు వెంకటయ్య, గంగుల వెంకటస్వామి, పాలకుర్తి బుచ్చయ్య, బిరెల్లి రాజన్న, మల్యాల గణపతి, ప్రమాణ స్వీకారం చేశారు.

సింగరేణి విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

- సీఎండీ బలరామ్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-జైపూర్



ఉద్యోగంలో కొనసాగినంత కాలం సంస్థ అభివృద్ధికి పాటుపడిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. హైదరాబాద్‌లో గల సింగరేణి భవన్‌లో శనివారం సీఎండీ ఎన్ బలరామ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించడంతో పాటు వినతి పత్రం అందజేశారు. సింగరేణి ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన ఎందరో చాలీ చాలని పెన్షన్ పొందుతూ ఆర్థికంగా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదీనంలో గల ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పోరేషన్)లో పని చేస్తూ పదవి విరమణ పొందిన ఉద్యోగులకు 70 సంవత్సరాలకు వయస్సు గల వారికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తున్న తీరును గుర్తు చేశారు. అదే క్రమంలో గాలి, వెలుతురు లేనటువంటి భూగర్భ ప్రదేశాల్లో పని చేసి పదవి విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ పెంపుకు నోచుకోకపోతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రకృతి ధర్మానికి వ్యతిరేకంగా విధులు నిర్వర్తించి అనేక దీర్ఘకాలిక వ్యాదులతో సతమతమవుతున్న సింగరేణి విశ్రాంత కార్మికులకు ఎటువంటి ఆర్థిక సదూపాయం లేకపోవడం బాధాకరమని తెలిపారు. ఓఎన్‌జీసీలో రిటైర్డ్ అయిన కార్మికులు ఆర్థిక ప్యాకేజీలు పొందుతున్నట్లుగా సింగరేణిలో పదవి విరమణ పొందిన వారికి అదే తరహాలో ఆర్థికంగా సహకరించాలని కోరారు. సీఎండీ బలరామ్‌ను కలిసిన వారిలో కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రదాన కార్యదర్శి బాబు రావు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్‌తో పాటు బీరయ్య, వెంకటరమణ, సాయిరాం గౌడ్ పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

నవతెలంగాణ-జన్నారం



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులాలకు 50 రిజర్వేషన్ కేటాయించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు పేరం అలేఖ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు 50శాతం టికెట్లు ఇవ్వాలని బీసీ సంఘాలు ఉద్యమించినప్పటికీ ఏ పార్టీ కూడా సరైన నిష్పత్తిలో టిక్కెట్లు ఇవ్వలేదనీ ఇటీవల మే 13న జరిగిన పార్లమెంటు ఎన్నికలలో కూడా బీసీలకు 50శాతం టికెట్లు ఇవ్వాలని బీసీ సంఘాలు కోరినప్పటికీ ఏ పార్టీ కూడా బీసీలకు 50 శాతం టిక్కెట్లు కేటాయించలేదని, ఇప్పుడు కనీసం స్థానిక సంస్థలైన సర్పంచ్, వార్డ్ మెంబర్, ఎంపీటీసీ, జడ్పీటీసీ మండల ప్రెసిడెంట్ ఎన్నికలలో 50శాతం టికెట్లు బీసీలకు కేటాయించాలని బీసీ మహిళ సంఘాలుగా కోరుతు న్నామని అలేఖ్య అన్నారు. మొత్తం మీద 33శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని 33 శాతంలో బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిష్పత్తిలో టిక్కెట్లు కేటాయించాలన్నారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో పార్లమెంటు సమావేశాలు రెండు రోజులు ప్రత్యేకంగా సమావేశ పరిచి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదింప చేయడం జరిగినదని, ఆ బిల్లు ప్రకారంగా 33శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో అమలు చేస్తూ అందులో 50శాతం బీసీ మహిళలకు టికెట్లు కేటాయించాలని ఈ సందర్భంగా అలేఖ్య కోరారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



నవతెలంగాణ-నస్పూర్

జెన్ షితో-ర్యు కరాటే స్కూల్ మంచిర్యాల ఆధ్వర్యంలో సీసీసీ నస్పూర్ సీతారామ కల్యాణ మండపంలో కరాటే బెల్ట్ గ్రేడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిభను కనబరిచారని మాస్టర్ పోచంపల్లి వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మదర్స్ ప్రైడ్ స్కూల్ డైరెక్టర్ రేగళ్ల ఉపేందర్, గ్రీన్ కిడ్స్ ప్లే స్కూల్స్ డైరెక్టర్ పెంచాల శ్రీధర్, కేజీఎ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కె కుమార్, ఇన్స్ట్రక్టర్ రమేష్, దృష్టి స్కూల్ ప్రిన్సిపాల్ అంబాల రాజ్ కుమార్, సీనియర్ కరాటే మాస్టర్ రంగా రమేష్ పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన నాసాని శ్రీనివాస్ పోలీసు శాఖలో(గ్రే హౌస్) డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ డ్రైవర్‌గా గుర్తించి తమ సేవ అవార్డు అందించి, రూ.20 వేల నగదును అందజేసింది. ఈ సందర్భంగా జన్నారం మండల కేంద్రంలో మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో అతనికి శాలువా పూలమాలలతో సత్కరించారు. నాసాని శ్రీనివాస్ మరిన్ని ఉన్నతమైన అవార్డులను తీసుకొని ఆదర్శంగా నిల్వారని మున్నూరు కాపు సంఘ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, గోపి సత్యనారాయణ, లెక్కల మల్లయ్య పూదరి నరసయ్య, కస్తూరి భూమన్న, దాసరి రాజన్న, దాసరి శ్రీనివాస్, లెక్కల ప్రసాద్, నరసయ్య, పవన్, కాసెట్టి రాజన్న పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో వత్తి శిక్షణా కేంద్రంలో హెడ్ ఓవర్మెన్‌గా పనిచేస్తున్న రాజకుమార్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తూ 53 సార్లు రక్తదానం చేసిన రాజకుమారును శనివారం జీఎం సంజీవరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తూ 53 సార్లు రక్తదానం చేసిన మహోన్నతవ్యక్తి అని, మంచిర్యాల జిల్లాలో సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు ఎక్కువ ఉన్నారని వీరికి విరివిరిగా రక్తం అవసరం ఉంటుందని, వారిని కాపాడడంలో వీరు చేసిన సేవ అభినందించదగినదని పేర్కొన్నారు. ఆయన జూన్ 14న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితలగని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, డీవై సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, సీనియర్ పీఓ పి కాంతారావు పాల్గొన్నారు.



బాలికపై లైంగికదాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

నవతెలంగాణ-బెజ్జూర్



ఆరేండ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఆరేకుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో ఆరేండ్ల పాపను కిడ్నాప్ చేసి మిల్లు సమీపంలోని నిర్మానుష ప్రదేశంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి హతమార్చాడని తెలిపారు. అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ డోకే వెంకన్న, ఎంపీటీసీ లంగారి శ్రీను, సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ దందేరా ఇస్తారి, పొట్టే విలాస్, కొర్తే లాలయ్య పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మేక మృతి

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



విద్యుద్ఘాతంలో మేక మరణించిన ఘటన మావల మండలంలోని వాఘాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన మేకల కాపరి ఎల్లార్కర్ అరీఫ్‌కు చెందిన మేక శనివారం దోభీఘాట్ సమీపంలో నీటి తొట్టె దగ్గరున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మరణించింది. నీటి తొట్టె దగ్గర నీళ్లు తాగేందుకు వెళ్లే క్రమంలో ఘటన జరిగినట్టు తెలిసింది. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి దూద్‌రాం రాథోడ్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మేక విలువ దాదాపు రూ.12 వేలుంటుందన్నారు.

భారీగా దేశీదారు నిల్వలు పట్టివేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో శనివారం మహారాష్ట్రకు చెందిన దేశీదారు నిల్వలను పెద్ద మొత్తంలో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపిన ప్రకారం స్థానిక తిలక్‌నగర్‌లో భారీ మొత్తంలో దేశీదారు నిల్వలు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. యేనం రాజు ఇంట్లో తనిఖీలు చేయగా 3,000 దేశీదారు బాటిళ్లు (90 ఎంఎల్) లభ్యమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని సీఐ వివరించారు. మహారాష్ట్రకు సరిహద్దు ప్రాంతం కావడంతో నిత్యం అటు నుండి ఇటు దేశీదారు రవాణా అవుతున్నట్లు అందుతున్న సమాచారం మేరకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సి నరసింహారెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు దాడులు చేస్తున్నట్టు తెలిపారు. మహారాష్ట్ర నుండి దేశీదారు అక్రమ రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ సురేష్, సిబ్బంది శ్రీనివాస్, మల్లేష్, సతీష్ మండల్, స్రవంతి పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు

- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు
- భావోద్వేగానికి గురైన ప్రిన్సిపాల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో 2021-24 బ్యాచ్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెర్వెల్ పార్టీ కార్యక్రమంలో సీనియర్లకు జూనియర్‌లు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు సినిమా పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తు అలరించారు. ఈలలు కేకలు వేస్తూ సందడి చేశారు. కాగా ప్రిన్సిపల్ జలగం అనితతో పాటు అధ్యాపకులు విద్యార్థులతో తమకు ఉన్న బంధాన్ని తెలియజేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అలాగే విద్యార్థులు సైతం తమకు కళాశాలతో ఉన్న అనుభవాన్ని పంచుకున్నారు. 3 సంవత్సరాల జ్ఞాపకాలను నేమురవేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.జలగం అనిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులు వారి చదవులు పూర్తి కళాశాలల నుంచి వెళ్లిపోవడం బాదగా ఉన్నప్పటికి భవిష్యత్తులో మంచి స్థానాలను సంపాదించాలని ఆకాంక్షించారు. ఇదే క్రమశిక్షణతో భవిష్యత్ లో రాణించాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రభాత్ రావ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరు గ్రూపులపై కేసు నమోదు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలో చోటు చేసుకున్న భూ వివాదంలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని మర్తిడి శివారు సర్వే నెంబర్ 167/2, 167/3, 167/4లోని 34 ఎకరాలను దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన గజ్జెల సురేష్ కొనుగోలు చేశాడు. ఇదే భూమిని తాను కొనుగోలు చేసినట్లు బెజ్జూరు మండలం సలుగుపెల్లి గ్రామానికి చెందిన భిక్షపతిగౌడ్ తరచుగా భూమి మీదికి వస్తుండడంతో వీరి మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ఈ భూమిలో సురేష్ పత్తి విత్తనాలు వేయగా, వాటిని ధ్వంసం చేశాడని గజ్జెల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సలుగుపెల్లి గ్రామానికి చెందిన భిక్షపతిగౌడ్‌తో పాటు మరో 30 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. అదేవిధంగా భిక్షపతిగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గజ్జెల సురేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపు రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శంకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 1 ప్రకారం నడవని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ధనార్జనే లక్ష్యంగా పుస్తకాలను, దుస్తులను అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. పాఠశాలలు కనీస భద్రత నిబంధనలు పాటించడం లేదన్నారు. కార్యక్రమంలో టీవీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, టీవీఎస్ రాష్ట్ర కార్యదర్శి రేగుంట క్రాంతి కుమార్, జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, టీవీయూవీ జిల్లా ఇన్‌చార్జి జిలకర సిద్ధార్థ్ పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూ వాహిని కార్యకర్తలు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టం అమలులో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయటం లేదని ఆరోపించారు. వాటిని తక్షణమే అమలు చేయాలని, అక్రమ గో రవాణాను అడ్డుకునేందుకు శాస్వత చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మండల సహ సంయోజక్ లింగాల సంతోష్ గౌడ్, హిందూ వాహిని మండల అధ్యక్షులు సోలంకి సాయి కిరణ్, నాయకులు సాబ్లే సంతోష్ సింగ్, మహేందర్, సురేందర్, రవి నాయక్, శేఖర్, ధన్ను, లచ్చిరాం పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

- రెండు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ఓ గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం కలకలం రేపిన కేసును పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. కాగా ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జీవన్ రెడ్డి శనివారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియ సమావేశంలో వెల్లడించారు. ఖుర్షీద్ నగర్‌కు చెందిన ఖలీల్ ఖాన్ ఆటో నడుపుకుంటు తన జీవనం సాగిస్తున్నాడు. పదేండ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన సుభద్ర, తన కుతుళ్లు భారతి, అనసూయతో కలిసి ఆదిలాబాద్‌కు వచ్చారు. జిన్నింగ్ మిల్లులో పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోశించుకున్నారు. ఇదే క్రమంలో ఆటో నడుపుతున్న ఖలీల్‌కు భారతితో పరిచయం ఏర్పడింది. మాయమాటలు చెప్పి ఆమెను ఖలీల్ పెళ్లి చేసుకున్నాడు. ఎస్టీ కులానికి చెందిన భారతి మతం మారగా సల్మాగా పేరు మార్పించాడు. భర్త ఖలీల్ వేధింపులు తట్టుకోలేక భార్య భారతి (సల్మా) 2024 మార్చ్‌లో ఇంటి నుండి వెళ్లిపోయింది. ఈ విషయమై తన భార్య కనబడడం లేదని ఖలీల్ టూ టౌన్ పీఎస్‌లో అప్పుడు ఫిర్యాదు సైతం చేశాడు. అయితే పోలీసులు ఆమె ఆచూకి కనుక్కొని స్టేషన్ కు తీసుకువచ్చారు. ఆ సమయంలో భర్తతో ఉండనని చెప్పడంతో తన చెల్లి అనసూయకు భారతి (సల్మా)ను అప్పగించారు. మళ్ళీ భారతి (సల్మా) కు మాయమటలు చెప్పి ఖలీల్ ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు. మళ్ళీ భార్యపై అనుమానం పెంచుకుంటు వచ్చాడు. ఈనెల 12న బయట నుండి ఇంటికి వచ్చిన తరువాత ఇంట్లో నుండి ఎవరో వ్యక్తి బయటకు వెళ్లినట్టు ఖలీల్ గమనించాడు. ఈ విషయమై ఆరోజు భార్యతో తీవ్రస్థాయిలో గొడవపడ్డారు. పక్కనే ఉన్న చెక్కలతో ఆమె తల, ఛాతిపై కోట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే ఇంట్లో మరణించింది. తనపై అనుమానం రావద్దనే ఉద్దేశ్యంతో అర్ధరాత్రి దాటిన తరువాత తన ఆటోలో శవాన్ని మమత జిన్నింగ్ సమీపంలో మృతదేహాన్ని పడేశాడు. మళ్ళీ ఇంటికి వెళ్లి ఆటో పెట్టేసి ఇంటి నుండి ఖలిల్ పారిపోయాడు. మరుసటి రోజు ఈనెల 13న అటుగా వెళ్తున్న స్థానికులు శవాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రెండు టీంలను ఏర్పాటు చేయగా విచారణ చేపట్టడం ప్రారంభించారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా ఈనెల 14న నిందితుడు ఖలీల్‌ను పట్టుకున్నారు. అనంతరం అతడిని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి నుండి ఆటో, కొట్టడానికి వాడిన చెక్క కట్టెలను, ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. అతనిపై అట్రాసిటీ, మర్డర్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి 24 గంటల్లో నిందితున్ని అరెస్టు చేసిన వన్, టూ టౌన్ సీఐలను సిబ్బందిని డీఎస్పీ అభినందిచారు. సమావేశంలో వన్ టౌన్, టూ టౌన్ సీఐలు సత్యనారాయణ, అశోక్, టూ టౌన్ ఎస్ఐ లాల్ సింగ్ నాయక్, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని న్యూ రాజంపేట కాలనీకి రోడ్డు స్థలం వదలకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే కోవలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రభుత్వం గతంలో ప్లాట్లు కేటాయించగా కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. కాలనీకి వెనుక భాగంలో రోడ్డుకు స్థలం కేటాయించినప్పటికిని రోడ్డుకు స్థలం వదలకుండా పక్క భూమి వారు నిర్మాణాలు చేపడుతున్నారని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణాలను నిలిపివేసి కాలనీకి రోడ్డు కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు బుర్సా పోచయ్య, గోపి, మల్లయ్య, అరుణ్, మంగేశ్వరి పాల్గొన్నారు.

నియామక అధికారి లేని గిరిజన విద్యారంగం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో గిరిజన విద్యారంగానికి నియామక అధికారి లేకుండానే విద్యారంగాలు కొనసాగుతున్నాయని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యం.శ్యామూల్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలో పీజీ హెచ్ఎం, ఎస్ఏలున్నారని, జీఓ నెంబర్ 45 ప్రకారం డీడీలుగా కొనసాగుతున్నారని తెలిపారు. జీఓ నెంబర్ 317 అమలులోకి వచ్చి ఏండ్లు గడుస్తున్న ఇప్పటి దాకా గిరిజన విద్యారంగంలో పని చేస్తున్న అధికారులను నియామక అధికారిగా నియమించడంలో నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడ్డారు. నియామక అధికారిగా వెంటనే నియమించి బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ చంద్రభాన్, వీరయ్య, కోశాధికారి రావిత పాల్గొన్నారు.

పాఠశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు



ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పర్యవరణ పరిరక్షణలో భాగంగా శనివారం మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారని జిల్లా ఎన్జీటీస్ కోఆర్డినేటర్ కంటే నరసయ్య తెలిపారు. పర్యావరణంపై శనివారం 24వ తేది వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించామని పేర్కొన్నారు. భూతాపం పెరిగి గడిచిన వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ఇలాంటి నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతుందన్నారు. గతంలోనే పర్యావరణ ఎకో క్లబ్బులను ఏర్పాటు చేయగా వీటి ద్వారా శనివారం నుంచి ప్రభుత్వ పాఠశాలలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటి రోజు మొక్కల పెంపకం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం అనే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 18న వైజ్ఞానిక ఆహారపు అలవాట్లు, 19న వ్యర్థాలను తగ్గించడం, 20న చెత్తను తగ్గించడం, 21న ఇంధన శక్తిని ఆదా చేయడం, 22న నీటిని పొదుపు చేయడం, 24న ప్లాస్టిక్ నివారణ చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో అంకోలి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : బెల్లంపల్లి ఏసీపీ

నవతెలంగాణ-తాండూర్

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుదని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. శనివారం తాండూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దైనందిన జీవితంలో క్రీడలను అభిరుచిగా ఎంచుకోవాలని సూచించారు. యువత రోజు వారి జీవితంలో రెండు గంటల పాటు క్రీడలకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. క్రీడలతో మానసిక ప్రశాంతతను పెంపొందించుకొని చదువులో రాణించవచ్చన్నారు. క్రీడల వల్ల మంచి శారీరక దారుఢ్యం పెంపొందుతుందని శారీర దారుణ్యంతో రక్షణ శాఖల్లో ఉద్యోగాలు సాధించవచ్చునని తెలిపారు. యువత సెల్ ఫోన్లతో కాలాన్ని వృధా చేయకూడదన్నారు. యువత తంబాకు, గుట్కా, సిగరెట్, గంజాయి లిక్కర్ వంటి మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత తమ జీవితాన్ని ప్రణాళికబద్ధంగా మలుచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్, తాండూర్, బీమిని, నెన్నెల, కన్నెపెల్లి మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

మందమర్రి : పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా శనివారం మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు కేంద్ర బిందువు యువత అని, యువత తలుచుకుంటే ఎన్నో విజయాలను సునాయాసంగా అందుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని అంతటి శక్తి యువతకి ఉందన్నారు. విద్యార్థులు యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉదయం వ్యాయామం చేసి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. గంజాయి, జూదం, ఇతర చెడు మార్గాల వైపు వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, గోపాల్, విశ్వనాథ్, శ్రావణ్ పాల్గొన్నారు.



తాండూర్ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బెల్లంపల్లి ఏసీపీ

మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా రవాణపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. శనివారం డిఎం విశ్వనాథ్ శనివారం డిఎం ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ డిపో పరిధిలో హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు, గ్రామాలకు నడుస్తున్న సర్వీసులపై చర్చించారు. మారుమూల ప్రాంతాలకు సర్వీస్‌లు నడిపేలా చూడాలన్నారు. ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా సర్వీస్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది బాపురావు పాల్గొన్నారు.

బూటకపు కేసుల్లో న్యాయమే గెలిచింది

నవతెలంగాణ-మందమర్రి

రియాజ్ అహ్మద్‌పై గత ప్రభుత్వం పెట్టిన బూటకపు కేసులను న్యాయస్థానం కొట్టివేయడంతో న్యాయమే గెలిచిందని హెచ్ఎంఎస్ మందమర్రి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ జె శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో యూనియన్ నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కుల కోసం పోరాడిన రియాజ్ అహ్మద్ ఆఫీస్‌ను అర్ధరాత్రి కూల్చి, అన్నలతో సంబంధాలున్నాయని అక్రమంగా ఆరు కేసులను పెట్టించిన కార్మిక వ్యతిరేకి నడిమెట్ల శ్రీధర్‌కు కోర్ట్ తీర్పు వ్యతిరేకంగా రావడంతో కేసులన్నీ బూటకమని రుజువైందన్నారు. సంస్థ సొమ్మును విచ్చలవిడిగా ఇవ్వడాన్ని ప్రశ్నించినందుకు కక్షతో కేసులు బనాయించినా అడ్డుకోవాల్సిన గత గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరించి శునకానందం పొందడం శోచనీయమన్నారు. తప్పుడు కేసులు పెట్టిన నడిమెట్ల శ్రీధర్‌కి న్యాయస్థానం మొట్టికాయలు వేసి రియాజ్ అహ్మద్‌కి అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసే హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ కేసులన్నీ కొట్టివేయడమే వీటికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెల్డి సుధర్శన్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, సంతోష్ పాల్గొన్నారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

నవతెలంగాణ-తాండూర్

తాండూరు గ్రామంలోని వాల్మీకినగర్ జంశెట్టి గట్టుమల్లయ్యకు చెందిన ఎద్దు శనివారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందింది. 15 రోజుల క్రితమే తాండూర్ బారెవాడకు చెందిన రైతు వద్ద రూ.70 వేలకు ఎడ్ల జత కొనుగోలు చేసినట్లు బాధిత రైతు తెలిపారు. జతలోని ఒక ఎద్దు పిడుగు పడి మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తాండూరు పశు వైద్యాధికారి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోని నష్టపరిహారం ఇవ్వాలని బాదితుడు కోరాడు.

మానవ మృగాన్ని ఉరితీయాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దహెగాం మండలానికి చెందిన చిన్నారి సహస్రను అత్యాచారం చేసి హతమార్చిన మానవ మృగాన్ని ఉరితీయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. సహస్ర ఘటనకు నిరసనగా శనివారం పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి మానవ మృగాలకు తావు లేకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితున్ని ఉరితీయాలన్నారు. ప్రభుత్వం సహస్ర కుటుంబ సభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-కుభీర్

బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. శనివారం కుభీర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న విధుల గురించి ఎస్ఐ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నైలు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వారితో స్నేహ భావంతో ఉండేలా చూడలన్నారు. ఎలాంటి సమస్యలున్న డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

ఎస్జీటీల చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

భాషా పండితులు, పిఈటీల అప్‌గ్రేడేషన్ విషయంలో సమాన అర్హతలు ఉన్న ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం చేస్తూ 70 వేల ప్రాథమిక ఉపాధ్యాయుల ప్రయోజనాలకు నష్టం కలిగించిన అధికారుల తప్పుడు వైఖరికి వ్యతిరేకంగా ఆదివారం తలపెట్టిన ఎస్జీటీల రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో బాగంగా ఛలో హైదరాబాద్ కార్యక్రామానికి మంచిర్యాల జిల్లా నుంచి ఎస్జీటీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా ఎస్జీటీల ఫోరం జేఏసీ నాయకులు వేల్పుల కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఎస్ఏ, ఎల్పీ, పీఈటీలలో ఎస్జీటీలకు జరుగుతున్న అన్యాయం వివరించడానికి, 12, 24 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఎస్జీటీ ఉధ్యాయులకు బై గ్రేడ్ పదోన్నతి ఇస్తూ ఎస్ఏ, జీహెచ్ఎం హోదా కల్పించాలని, 10 వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, జీఓ 317, పెండింగ్ డీఏలు తదితర సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఎస్జీటీలు భారీగా తరలిరావాలని కోరారు.